క్లుప్తంగా

జగన్‌తోనే పేదల అభ్యున్నతి



గొల్లపాలెం నుంచి సభకు తరలివెళుతున్న యువకులు, కార్యకర్తలు

కాజులూరు: ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో పేదల భవిష్యత్తుకు భరోసా లభిస్తోందని జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు అన్నారు. పిఠాపురంలో శనివారం జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు కాజులూరు మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా గొల్లపాలెంలో యువకుల బైక్ ర్యాలీని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో పేదల కష్టాలు చూసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మెనిఫెస్టోను రూపొందించి అధికారంలోనికి వచ్చాక నవరత్నాల పథకం పేరుతో నూర శాతం హామీలను అమలు చేశారన్నారు. ఆ పథకాలు నిరంతరం కొనసాగాలంటే రానున్న ఎన్నికలలో ప్రజలు మరో మారు వైఎస్సార్‌సీపీని గెలిపించి అధికారంలోనికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నేడు లొల్లలో దంత వైద్య శిబిరం

రాయవరం: మండలంలోని విశ్వమానవతా ఆశ్రమం వద్ద ఆదివారం ఉదయం దంత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని విశ్వమానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి శనివారం విలేకరులకు తెలిపారు. దంత వైద్యులు ఎం.మానస, కె.నిమిషాల పర్యవేక్షణలో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించే శిబిరంలో వైద్యులు సేవలందిస్తారన్నారు. దంత వైద్య శిబిరంతోపాటుగా అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా నిపుణులైన వైద్యులతో వైద్యం, ఉచిత హోమియో మందులు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. లొల్ల, పరిసర గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

కాజులూరు: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని ప్రతి ఒక్కరూ ఓటుహక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని మండల తహసీల్దారు శాంతిలక్ష్మి అన్నారు. ఆమె శనివారం గ్రామాల్లో పర్యటించి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎన్నికల్లో ఓట్లు వేసే విధానంపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి పోలింగ్ బూత్ లోనూ నూరుశాతం ఓటింగ్ జరిగేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు, వీర్వోలు ఈశ్వర్రావు, సుబ్రహ్మణ్యం, గోపాలరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50 వేల విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం నిత్యాన్నదాన ట్రస్టుకు విజయవాడకు చెందిన చినమూరి సదాశివరెడ్డి రూ.50,000 విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయంలో పై మొత్తాన్ని ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథికి ఇచ్చి, స్వామి చిత్రపటం, లడ్డు ప్రసాదం దాత అందుకున్నారు.

అయినవిల్లిలో మరో రూ.50 వేలు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన చినమూరి సదా శివరెడ్డి కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకుని రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజుకు అందజేశారు. దాతను ఆలయ వేదపండితులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, ఆలయ పాలక వర్గ సభ్యులు అభినందించారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం గ్రామంలో శనివారం రోడ్డు ప్రమాద బాధితుడు, ఆదర్శ యూత్ మెంబర్ కొల్లాబత్తుల ఆనందరావుకు చికిత్స నిమిత్తం సదరు ఎన్నారై యూత్ సభ్యులు కలిసి రూ.55,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు పై మొత్తాన్ని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నల్లి డేవిడ్ చేతుల మీదుగా ఆనందరావుకు ఇచ్చారు. స్థానికులు బత్తుల బాలాజీ కుమార్, యడ్ల రత్నబాబు ద్వారా సమాచారం అందుకున్న ఎన్నారై యూత్ సభ్యులు, ఈ మేరకు వారి ద్వారానే ఈ మొత్తాన్ని విదేశాల నుంచి ఇక్కడకు పంపారు. నల్లి శుభాష్, కొల్లాబత్తుల రాజు, నల్లి రాజు, యూత్ ప్రెసిడెంట్ కొల్లాబత్తుల రఫీక్ పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

ఆలమూరు: నిబంధనలకు విరుద్ధంగా సారా రవాణా చేస్తున్న వల్లూరి సతీష్‌ను ఆలమూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఎస్సై ఎల్.శ్రీను నాయక్ కథనం ప్రకారం రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని పిడింగొయ్యికి చెందిన సతీష్ తన బైక్‌పై 110 లీటర్ల సారాను తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై నేతృత్వంలోని పోలీసుల బృందం పహారా నిర్వహించి నిందితుడ్ని ఏటిగట్టు మీద వలపన్ని పట్టుకున్నారు. ఈ మేరకు కేసును నమోదు చేసిన ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- మండలంలో 53 పోలింగ్ కేంద్రాలు
- ఆరు సమస్యాత్మక గ్రామాల గుర్తింపు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 52,871 మంది ఓటర్లు
- నేటి మధ్యాహ్నం తర్వాత పోలింగ్ కేంద్రాలకు చేరుకోనున్న సిబ్బంది



రాయవరంలో పోలింగ్ కేంద్రం వద్ద గదులను, పరిసరాలను శుభ్రం చేసే సిబ్బంది

రాయవరం: సాధారణ ఎన్నికల్లో భాగంగా సోమవారం జరగనున్న పోలింగ్‌కు సర్వం సన్నద్ధం చేశారు. పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. మండలంలోని కూర్మాపురం, కురకాళ్లపల్లి, వెంటూరు, చెల్లూరు, పసలపూడి, మాచవరం, సోమేశ్వరం, లొల్ల, రాయవరం, వి.సావరం, వెదురుపాక, నదురుబాద గ్రామాల్లో 53 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమేశ్వరం గ్రామంలో మూడు, మాచవరంలో ఒకటి, చెల్లూరులో ఐదు, కురకాళ్లపల్లిలో ఒకటి, వెంటూరు, పసలపూడిలో మూడేసి వంతున సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. సమస్యాత్మక గ్రామాల్లో, ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తహసీల్దారు ఆర్‌వీ కృష్ణారావు తెలిపారు. వెబ్ కెమేరాలు ఏర్పాటుకు అవకాశం లేని పోలింగ్ కేంద్రాల్లో వీడియో గ్రాఫర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నిర్వహిస్తున్న పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీటి సౌకర్యం, వరండాలు, చెట్లు లేని చోట్ల ఓటర్లకు ఎండవేడిమి తగలకుండా షామియానాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓటర్లకు ఓటింగ్ స్లిప్‌లను ఇప్పటికే బూత్ లెవెల్ అధికారుల ద్వారా అందజేయడం జరిగిందన్నారు. ఓటరు స్లిప్ అందక పోయినా ఓటరు ఓటు వేయవచ్చు. ఆన్‌లైన్ ద్వారా ఓటరు ఓటరు స్లిప్పులను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశముంది. అయితే ఎన్నికల కమిషన్ అనుమతించిన ఓటరు గుర్తింపు కార్డుతో కలిపి 12 డాక్యుమెంట్లలో ఏది తీసుకుని వచ్చినా ఓటు వేసేందుకు అనుమతిస్తారు. మండలంలో చేరికలతో కలిపి పురుషులు 25,893, స్త్రీలు 26,977, ట్రాన్స్‌జెండర్ ఒక ఓటరు ఉన్నారు. మండలాన్ని ఆరు సెక్టార్లుగా విభజించి, ఆరుగురు సెక్టార్, మరో ఆరుగురు అసిస్టెంట్ సెక్టార్ అధికారులను నియమించారు. మండలాన్ని 17 రూట్లుగా విభజించామన్నారు. మండలంలోని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది ఆదివారం మధ్యాహ్నం తర్వాత పోలింగ్ కేంద్రాలకు చేరుకోనున్నారు. పోలింగ్ సిబ్బంది వచ్చే సమయానికి పోలింగ్ కేంద్రాలను, పరిసరాలను శుభ్రం చేసి, మౌళిక సదుపాయాలను కల్పించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు.

కఠిన చర్యలు తీసుకుంటాం : ఎస్సై

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాయవరం ఎస్సై జి.నరేష్ తెలిపారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వద్ద ఒక్కో కానిస్టేబుల్‌ను నియమించామన్నారు. సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల వద్ద ఐదుగురు కానిస్టేబుళ్లను నియమించినట్లు తెలిపారు. పోలింగ్‌కేంద్రానికి 100 మీటర్ల దూరం వరకు ఎవరిని అనుమతించమన్నారు. శాంతి భద్రతలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఆరు రూట్ మొబైల్ పార్టీలు, డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, తన ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్స్‌ను నియమించామన్నారు. ఆరు రూట్లకు నలుగురు ఎస్సైలు, ఒక సీఐ, ఒక డీఎస్పీని నియమించారన్నారు. వీరందరిపై నియోజకవర్గ పోలీస్ ఇన్‌చార్జి, అడిషనల్ ఎస్పీ సీహెచ్.పాపారావు పర్యవేక్షణ చేస్తారన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు

రాయవరం: సార్వత్రిక ఎన్నికలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు వేసేందుకు వచ్చే ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఎన్నికల సంఘం ఆదేశించడంతో ఆ దిశగా చర్యలు చేపట్టారు. ప్రతి కేంద్రంలో దివ్యాంగులు, వృద్ధులు సులువుగా పోలింగ్ రూమ్‌లోకి వచ్చేలా ర్యాంపులు ఏర్పాటు చేశారు. ఓటర్లకు చల్లని తాగు నీటి సదుపాయం, అవసరమైన కుర్చీలు, టేబుల్స్, టాయిలెట్లు, షామియానాలు వంటి మౌలిక సదుపాయాలపై దృష్టి సారించారు. విద్యుత్తు, లైట్లు, ఫ్యాన్లు ఉన్నాయో, లేదో పరిశీలించి వాటిని సమకూర్చారు.

సిబ్బందికి భోజన సదుపాయాలు

పోలింగ్ సిబ్బందికి కూడా అల్పాహారంతో పాటు, భోజన సదుపాయాన్ని కూడా అధికార యంత్రాగం ఏర్పాటు చేస్తోంది. ఆదివారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకునే పోలింగ్ సిబ్బందికి ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశారు. ప్రతి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకునే సిబ్బందికి డిన్నర్‌ను అందించేలా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ రోజు సోమవారం ఉదయం అల్పాహారం, టీ, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, టీతో పాటుగా రాత్రి టిఫిన్ కూడా ఏర్పాటు చేస్తున్నారు.

ఎస్సీ, బీసీలపై ఎమ్మెల్యే వేగుళ్ల కపట ప్రేమ



రోడ్ షోలో ఓట్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజల సంతృప్తి
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ఎస్సీ, బీసీలపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చూపించేది కపట ప్రేమ మాత్రమేనని మండపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. రేపు జరగబోయే అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మండపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు తమ ప్రచారాన్ని హోరెత్తించారు. టీడీపీ ప్రచారానికి దీటుగా పార్టీ నాయకులు కార్యకర్తలు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో కూడా ఎక్కడిక్కడ విస్తృతంగా తమ ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గెలుపే లక్ష్యంగా ఈ పదిహేను రోజులు ప్రతి గ్రామాన్ని చుట్టిముట్టి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను, చేసిన అభివృద్ధిని వివరించడంలో సఫలీకృతులయ్యారు. ఆయనకు ఎక్కడికక్కడ మహిళలు హారతుల పట్టి ఘనంగా స్వాగతం పలికారు. ప్రజలకు అందించిన సంక్షేమాన్ని , అభివృద్ధిని వివరించారు. మరోపక్క తోట త్రిమూర్తులు కుటుంబ సభ్యులు సైతం ప్రజలతో మమేకయ్యారు. ఆయన కుమారుడు తోట పృథ్వీరాజ్, కోడలు ప్రత్యూష, కుమార్తె శ్రీలక్ష్మి మండపేట టౌన్‌తో పాటు, రూరల్ మండలాల్లోని చాలా వరకూ గ్రామాల్లో పర్యటనలు చేసి త్రిమూర్తులుకు ప్రజల మద్దతు కూడగట్టారు.

పలు గ్రామాల్లో ప్రచారం

శనివారంతో ఎన్నికల ప్రచారం ముగియడంతో మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు రోడ్ షోలు నిర్వహించి మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టి జగనన్నను సీఎం చేయాలని విజ్ఞప్తి చేశారు. మారేడుబాక, చినద్వారపూడి, పేకేటిపాకలు గ్రామాల్లో పార్టీ నాయకులు నేమాని రాజశేఖర్, కుడుపూడి భవానీరాంబాబు, వల్లూరి రామకృష్ణ, మేడిశెట్టి సూర్యభాస్కరరావు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, పలివెల సుధాకర్, నాగిరెడ్డి రాంబాబు, మట్టపర్తి గోవిందరాజు, ఈతకోట కిన్నెర ఇతర ప్రజాప్రతినిధులను వెంటబెట్టుకుని ప్రచారరథంపై రోడ్‌షోలు నిర్వహించారు.

99 శాతం హామీలు అమలు

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మేనిఫెస్టోను 99 శాతం హామీలు అమలు చేశారన్నారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసిన ఆయనను, మండపేట నియోజకవర్గంకు తానొచ్చిన ఈ నాలుగేళ్లో ఏ విధంగా అభివృద్ధి చేసాననేది, ప్రజలకు ఎంతలా చేరువలో వుంటూ అండగా ఉంటున్నాను అనే విషయాలపై బేరీజు వేసుకుని వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి తనను, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు పంపన లక్ష్మి, చెల్లుబోయిన నాగరాజు, నీల రాజు, మేడిశెట్టి శ్రీనివాసరావు, కడలి శ్రీను, సూరంపూడి సత్తిబాబు, కుడిపూడి అంజిమూర్తి , సూరంపూడి వెంకటరమణ, సూరంపూడి దుర్గాప్రసాద్, కాంఢ్రేగుల వెంకటేశ్వరరావు, పితాని ధనరాజు, కాదా శ్రీరాములు, మేడిశెట్టి వీరేంద్ర కొప్పిశెట్టి రాజు, వాసంశెట్టి శివప్రసాద్, కడియాల వీర వెంకట నాగేంద్రప్రసాద్, గ్రంధి సూరిపండు, టేకి దుర్గారావు, చొల్లంగి సత్యవేణి రాజశేఖర్, కొండపల్లి రాజేంద్రప్రసాద్, స్వతంత్ర రాజకుమార్, కాళ్ళ రాణి, పులగం శ్రీనివాస్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన 'కొండపల్లి'



రజక సంఘం నేతకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానిస్తున్న త్రిమూర్తులు

మండపేట: మండలంలోని ఏడిద గ్రామానికి చెందిన రజక సంఘం నాయకుడు కొండపల్లి సత్తిబాబు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. విజయలక్ష్మి నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో పార్టీ కండువా వేసుకున్నారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ తోట త్రిమూర్తులు నియోజకవర్గంలో చేసిన సేవలకు ఆకర్షించిపార్టీలో చేరినట్టు తెలిపారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచే తోట త్రిమూర్తులు నాయకత్వంలో తాను పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు గంధం రవికుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, ఏడిద గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ఏడిద గ్రామ పార్టీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి మల్లేశ్వరపు దుర్గా కుమార్, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, నాయకులు వాసిరెడ్డి అర్జున్, పువ్వల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లపైనే అందరి దృష్టి

- ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లు
- వారిని రప్పించేందుకు వాహనాలు ఏర్పాటు చేసిన పార్టీలు

రాయవరం: ఎన్నికల్లో ప్రతి ఓటరూ కీలకమే. ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లిన వారిని సైతం గ్రామాలకు రప్పించేందుకు ఆయా పార్టీల నేతలు పలు రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. పలువురు ఓటర్లు గ్రామాల నుంచి హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. వెళ్లిన వారిని పోలింగ్ రోజుకు రప్పించేందుకు పార్టీ నాయకులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ముఖ్యంగా ఉపాధికి వెళ్లిన వారంతా పండుగలు, పలు కార్యక్రమాలకు సొంతూళ్లకు వచ్చి వెళ్తూ ఉంటారు. వారి ఇళ్లు, భూములు గ్రామాల్లో ఉండడంతో రేషన్ కార్డులు కలిగి ఉన్నారు. ఓటరు జాబితాలో సైతం వీరి పేర్లు నమోదై ఉన్నాయి.

ప్రణాళిక సిద్ధం

గ్రామాల్లో అటువంటి ఓటర్లను పార్టీల నాయకులు గుర్తించి ఒక జాబితా తయారు చేసుకుని, వారితో ఫోన్‌లో సంప్రదింపులు చేశారు. వారిని రప్పించే బాధ్యతను ఆయా గ్రామాల్లో ఉండే నాయకులు తీసుకున్నారు. ఎవరెక్కడ ఉన్నారనే విషయమై స్థానిక నాయకులకు పూర్తి సమాచారం ఉంది. వారిని రప్పించేందుకు ప్రైవేట్ ట్రావెల్స్‌తో సంప్రదించి వాహనాలు ఏర్పాటు చేసినట్లు సమాచారం. వారికి అల్పాహారం, భోజన సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నారు. అలాగే పలువురు యువకులు హైదరాబాద్, బెంగళూర్, పూణే వంటి పట్టణాల్లో సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేస్తున్నారు. అటువంటి వారిని కూడా గుర్తించి ఇక్కడకు రప్పించేందుకు ట్రైన్, బస్ టిక్కెట్లు కూడా బుక్ చేసినట్టు సమాచారం. వారిని తీసుకొచ్చేందుకు అభ్యర్థులకు ఖర్చు తప్పదు. ఇందుకు లక్షల్లో వెచ్చిస్తున్నట్టు సమాచారం.

ముగిసిన ప్రచార పర్వం

- ఎన్నికలకు ముమ్మర ఏర్పాట్లు
- నేడు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద పంపిణీ
- పోలింగ్ స్టేషన్లకు సామగ్రి తరలింపు



వీఎస్ఎం కళాశాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల అధికారులు

రామచంద్రపురం: గత 20 రోజులుగా ఊదరగొట్టిన ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్ర 6 గంటలతో మైక్‌లు మూగబోయాయి. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ ఇతర ఇండిపెండెట్లు ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు నియోజకవర్గంలో ప్రచారం ముగిసింది. ప్రచార పర్వం మగియడంతో పోలింగ్ ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 1,00,682 మంది పురుష ఓటర్లు, 1,02,524 మంది స్త్రీ ఓటర్లు, ఒక ట్రాన్స్ జెండర్ ఓటుతో కలిపి మొత్తం 2,03,207 ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో 137 ప్రాంతాల్లో మొత్తం 239 పోలింగ్ కేంద్రాలున్నాయి. కాగా 78 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉండగా, 106 కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌కు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు. 24 మంది రూటు అధికారులు, 24 మంది సెక్టార్ల అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. మొత్తం 239 పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్వోలు 239 మంది ఓటర్లను సహాయాన్ని అందజేస్తారు. శాంతిభద్రతల పరిరక్షణకు భద్రతా ఏర్పాట్లకు సంబంధించి పోలీస్ యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టింది. ఎన్నిలక ఏర్పాట్లపై అధికారులతో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు.

నేడు డిస్ట్రిబ్యూషన్

రామచంద్రపురం అర్బన్‌లో ఓటర్లు 35,758 కాగా మహిళలు 18,556, పురుషులు 17 202 ఉన్నారు. రూరల్‌లో 56204మంది ఉండగా మహిళలు 29374, థర్డ్ జండర్ ఒకరు, పురుషులు 28829 ఉన్నారు. కాజులూరు మండలంలో 56950 మంది ఓటర్లు ఉండగా మహిళలు 28475, పురుషులు 28475, కె.గంగవరం మండలంలో 52295 కాగా మహిళలు 26119, 26176 మంది ఓటర్లు ఉన్నారు. రామచంద్రపురం అర్బన్, రూరల్, కాజులూరు, కె.గంగవరం మండలాల్లో 137 లొకేషన్స్‌లో 239 పోలింగ్ స్టేషన్స్ ఉన్నాయి. 20శాతం రిజర్వుతో కలిసి మొత్తం 239 పోలింగ్ బూత్‌లకు గాను 286 ఈవీఎంలను అందుబాటులో ఉంచారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఒక పీవో, ఒక ఏపీఓ నలుగురు ఓపీవోలు ఉంటారు. నియోజకవర్గంలో రిజర్వులో ఉన్నవారు కాకుండా 1434 మంది ఎన్నికల విధులు నిర్వహిస్తారు. నియోజకవర్గంలోని 239 పోలింగ్ కేంద్రాలకు గాను 24 రూట్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి రూట్‌కు రెండు బస్సుల్లో నాలుగు నుంచి అయిదు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మెటీరియల్‌తో పాటుగా సిబ్బంది కూడా వెళతారు. దీనికి సంబంధించి 40 సీటింగ్ బస్సులు, 15 ఆర్టీసీ బస్సులను తీసుకున్నారు. బస్సులు వెళ్లని రూట్లకు 8 టాటా ఏసీ వ్యాన్‌లను ఏర్పాటు చేశారు. కె.గంగవరం మండలంలోని గోదావరి మధ్యలోని శేరిల్లంకు ఒక వ్యాన్ ద్వారా పంపిస్తున్నారు. స్థానిక వీఎస్ఎం కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం వద్దకు ఎన్నికల విధులు నిర్వహించే పీఓ, ఏపీవో, ఓపీవోలు ఉదయం 7 గంటలకే చేరుకోవాలని ఇప్పటికే సమాచారాన్ని అందజేశారు.

ఎన్నికల ప్రచారానికి తెర

రామచంద్రపురం రూరల్: రేపు సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం 6 గంటలతో రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారానికి తెరపడింది. స్థానికుడిగా, సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో మమేకమై ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. అడుగడుగునా పిల్లి సూర్యప్రకాశ్‌కు ప్రజల నుంచి కూడా మద్దతు లభించింది. ఎంపీ బోస్‌ను ఇష్టపడే పార్టీ శ్రేణులు, రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అభిమానులు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అనుచరగణం అంతా ఒక్కతాటిపై నిలిచి ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకునివెళ్లారు. సూర్యప్రకాశ్‌కు అడుగడుగునా ప్రజల నుంచి గ్రామాల్లోను, రామచంద్రపురం పట్టణంలోను అపూర్వ స్వాగతం లభించింది. పోటీ అభ్యర్థిగా ఉన్న తెలుగుదేశం అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ స్థానికుడు కాకపోవడం, ఆయనపై 13 కేసులు ఉన్నట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనడంతో సూర్యప్రకాశ్ అంతా పాజిటివ్‌గా కనిపిస్తోంది. సొంతం సామాజికవర్గం శెట్టిబలిజలతో పాటు అధికంగా ఉన్న ఎస్సీ సామాజిక వర్గం పూర్తి స్థాయిలో వైఎస్సార్ సీపీ వెన్నంటి ఉన్నారు. దీనికి తోడు జనసేన అభిమానంతో తెలుగుదేశం పార్టీకి మద్దతు పలుకుతారనున్న కాపు సామాజికవర్గంలో అత్యధిక శాతం నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు జేజేలు పలికి సూర్యప్రకాశ్ వైపే నిలవడం, కాపు నేస్తం, నవరత్నాల పథకాలు అత్యధికంగా కాపులకు వరంగా మారడంతో వారిలోనూ వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవడంతో వైఎస్సార్ సీపీ గెలుపు నల్లేరుపై నడకగా మారిందని ప్రజలు చెప్పుకుంటున్నారు. నామినేషన్ రోజే ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్వయంగా సూర్యప్రకాశ్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని సూర్యప్రకాశ్ 30 వేల మెజార్టీతో గెలుస్తారని ప్రకటించారు.

పెరుగుతూ.. జాబితాల్లో ఒదుగుతూ...

- ప్రతి ఎన్నికకూ క్రమం తప్పకుండా పెరిగిన ఓటర్లు
- ఓటు హక్కు వినియోగం అందరి బాధ్యత

కపిలేశ్వరపురం: ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు. ఓటు వేయడమనేది వ్యక్తి సామాజిక బాధ్యత. అందుకే భారత ఎన్నికల సంఘం ప్రతి ఒక్క పౌరుడికి ఓటు హక్కును కల్పించాలని సాధ్యమైనంత వరకూ అవకాశాన్ని ఇస్తూనే ఉంది. ఎన్నికల సంఘం కృషి, పౌరుల ఉత్సాహం వెరసి సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య 2014 నుంచి ప్రస్తుత ఎన్నికలు వరకూ పెరుగుతూనే వచ్చింది. ఆ క్రమం రెండు నియోజకవర్గాల్లో ఇలా..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
2014 ఎన్నికల్లో ఓటర్లు ఇలా..				
మండపేట	96,423	99,485	07	1,95,915
రామచంద్రపురం	91,482	90,128	07	1,81,617
అమలాపురం పార్లమెంట్	6,82,359	6,75,065	51	13,57,475
2019 ఎన్నికల్లో				
మండపేట	1,04,851	1,09,471	02	2,14,324
రామచంద్రపురం	96,712	97,023	07	1,93,742
అమలాపురం పార్లమెంట్	7,28,612	7,30,147	29	14,58,788
2024 ప్రస్తుత ఎన్నికల్లో				
మండపేట	1,07,179	1,13,224	06	2,20,409
రామచంద్రపురం	1,00,682	1,02,524	01	2,03,207
అమలాపురం పార్లమెంట్	7,59,104	7,72,285	21	15,31,410

బాదం పప్పుపై తల్లీబిడ్డ చిత్రం



బిడ్డను లాలిస్తున్న తల్లిచిత్రం



రాయుడు త్రినాథ ప్రసాద్

రామచంద్రపురం రూరల్: మదర్స్ డేను పురస్కరించుకుని నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథ ప్రసాద్ బాదం పప్పు పలుకుపై బిడ్డను లాలిస్తున్న తల్లి చిత్రాన్ని చిత్రీకరించాడు. తల్లిని మించిన దైవం లేదని తల్లి ప్రేమకు ఏమీ సరికాదని ఆయన తన మనోభావాన్ని బాదం పప్పు పలుకుపై చిత్రీకరించి తెలియజేశారు. ఆయనను పలువురు అభినందించారు.